కొత్త రేషన్ కార్డులకు మోక్షమెప్పుడు?



- ఆశగా ఎదురు చూస్తున్న అర్హులు
- తొమ్మిది నెలలైనా ఆ ఊసే ఎత్తని కూటమి ప్రభుత్వం
- దక్షిణలో వందలాది కుటుంబాల నిరీక్షణ

కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. **ప్రభుత్వం** దీనిపై అసలు **ఆలోచన** చేస్తున్నట్లు లేదు. రేషన్ కార్డుల కోసం అర్హులైన వారు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

అల్లిపురం: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి తొమ్మిది నెలలు పూర్తి కావస్తున్నా కొత్త రేషన్ కార్డులకు సంబంధించి తగిన ఆదేశాలు ఇవ్వకపోవడంతో తీవ్ర నిరసన వ్యక్తం అవుతోంది. నియోజకవర్గంలో వందలాది మంది అర్హులు కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం దీనిపై అసలు ఆలోచన చేస్తున్నట్లు లేదు. రేషన్ కార్డుల కోసం అర్హులైన వారు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాకుండా ఏమీ చేయలేమని సచివాలయ సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. దీంతో అక్కడికి వెళ్లిన ప్రజలకు నిరాశగా తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. కార్డుల్లో మార్పులు, చేర్పులకు కూడా అవకాశం ఉండటం లేదు.

హామీలతో సరిపెట్టారు..

అధికారం కోసం ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక మాత్రం వాటిని పట్టించుకోవడం లేదు. రేషన్ కార్డులు అనేక సంక్షేమ పథకాల అమలుకు ఆధారం. కార్డులు మంజూరు చేయడంలో కూటమి ప్రభుత్వం ఇంత జాప్యం చేయడంతో ప్రజలు మండిపడుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇంటి వద్దకే సేవలు..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డుల మంజూరు పారదర్శకంగా జరిగేది. అర్హులైన ప్రజలు సచివాలయం వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకుంటే వెంటనే కార్డులు మంజూరయ్యేవి. కొన్ని సందర్భాల్లో గంటల వ్యవధిలో కూడా కార్డులు మంజూరు చేశారు. కార్డుల్లో కొత్తగా సభ్యులను చేర్చుకోవాలన్నా, తొలగించాలన్నా సచివాలయం పని దినాల్లో ప్రభుత్వ సైట్లు ఎప్పుడూ అందుబాటులోనే ఉండేవి. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వారే స్వయంగా దరఖాస్తు చేసి కార్డు మంజూరైతే ఇంటికి తీసుకొచ్చి లబ్ధిదారులకు అందజేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూలు విడుదల చేసినప్పటి నుంచి సైట్లన్నీ మూసేశారు. దీంతో ఇదేం పాలన అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

కొత్త కార్డుల మంజూరు ఎప్పుడు?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు పూర్తవుతుంది. ఇప్పటి వరకు కొత్త కార్డుల ఊసేలేదు. కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం లేదు. అసలు సైట్లే ఓపెన్ కావడం లేదు. ఇప్పటికైనా పాలకులు స్పందించి కొత్త కార్డుల మంజూరుకు మార్గదర్శకాలు జారీ చేయాలి.

– గంగన్, బంగారుమెట్ట

సమాధానమే లేదు..



సచివాలయాల్లో కొత్త కార్డుల కోసం అడిగితే సమాధానమే ఉండటం లేదు. గత ప్రభుత్వంలో వలంటీర్లు ఉండేవారు. వారు అన్ని వివరాలు తెలియజేసేవారు. ఇప్పుడు వాళ్ల లేక ఏ విషయం తెలియడం లేదు. సచివాలయాల్లో కూడా ఎవరూ అందుబాటులో ఉండటం లేదు.

– వాకాడ విజయ మౌనికారెడ్డి, కుమ్మరవీధి

కార్డుల కోసం ఎదురుచూపులు..



గత ప్రభుత్వ హయాంలో గంటల వ్యవధిలో రేషన్‌కార్డులు వచ్చేవి. వలంటీర్లు ఇంటింటికీ వచ్చి కార్డుల కోసం దరఖాస్తు చేయించే వారు. ప్రస్తుతం కార్డులు సకాలంలో అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వందలాది మంది కొత్త కార్డుల కోసం మార్పులు, చేర్పుల కోసం ఎదురు చూస్తున్నారు.

-పాల శ్రీహరిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు

సేవలకు ఇక సెలవ్..





వైద్యం అవసరమైన వారిని ఆస్పత్రికి తరలించే అంబులెన్స్‌లు ఎటూ కదలక నిరుపయోగంగా పడి ఉన్నాయి. కేజీహెచ్ పార్కింగ్ స్థలంలో కనిపించిన ఆ వాహనాలు ఏళ్ల నుంచి సర్వీసులో లేనట్లు తుప్పు పట్టి కనిపించాయి. -ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



ఫిషింగ్ హార్బర్ సాగర జలాల్లో వ్యర్థాల తొలగింపు కార్యక్రమం ముమ్మరంగా జరుగుతోంది. విశాఖపట్నం పోర్టు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమం ఆదివారం కూడా కొనసాగింది.

- ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

క్లుప్తంగా

గ్రామ దేవత పండగకు వాసుపల్లి ఆర్థిక సాయం

అల్లిపురం: జీవీఎంసీ 34వ వార్డు గ్రామదేవత పండగకు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ రూ.5 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజా సేవలో ఉంటానన్నారు. మదర్‌థెరిస్సా ఆశయంతో, అంబేడ్కర్ అడుగుజాడల్లో ప్రజా సేవ చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్నమ్మ గుడి చైర్మన్ లండా రమణ తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళకు ఆశ్రయం



షఖీల బేగంను వసతి గృహంలో చేర్పించిన పచ్చిరిపల్లి రాము తదితరులు

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డుకు చెందిన ఎం.డి.షఖీలా బేగం 20 రోజులుగా కేజీహెచ్ ఔట్‌గేట్ వద్ద పడి ఉంది. విషయం తెలుసుకున్న వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు పచ్చిరిపల్లి రాము, పీవీ నరసింహారెడ్డి, పూతి కృష్ణారెడ్డి, మజ్జి రెడ్డి ఆమెకు తగిన సపర్యలు చేసి ఆహారం అందించారు. అనంతరం టూటౌన్, ఎంఆర్ పేట సీఐల సహకారంతో టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో గల జీవీఎంసీ ఏయూటీడీ మహిళల నిరాశ్రయ వసతి గృహంలో చేర్పించారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ఎర్నిమాంబకు హారతి సేవ

కంచరపాలెం: కాన్వెంటు కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ. 10, రూ. 50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తుల సౌకర్యాలు పర్యవేక్షించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లను హెచ్చరిస్తున్న వన్‌టౌన్ సీఐ జీడీ బాబు

దాబాగార్డెన్స్: వన్‌టౌన్ సీఐ జీడీ బాబు ఆదివారం స్టేషన్ పరిధిలో గల రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రెచ్చిపోతే కఠిన చర్యలు తప్పవంటూ హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్టు చెప్పారు. పౌరుల భద్రతకు ముప్పుగా మారే అసాంఘిక వ్యక్తులపై రౌడీ షీట్లు నమోదు చేసి, అవసరమైన మేరకు కఠిన చర్యలు అమలు చేస్తామని హెచ్చరించారు. నగరంలో శాంతి భద్రతలకు భంగం కలిగించే కార్యకలాపాలపై తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సీఐ జీడీ బాబు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

భద్రతా పోటీల్లో గైస్ విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ

మురళీనగర్: జాతీయ భద్రతా దినోత్సవం సందర్భంగా డిపార్టుమెంట్ ఆఫ్ ఫ్యాక్టరీ నిర్వహించిన భద్రతా ప్రమాణాలపై నిర్వహించిన పోటీల్లో కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు ఇనిస్టిట్యూట్ విద్యార్థులు సత్తా చాటారు. వివిధ పాఠశాలల విద్యార్థులు, ఐటీఐ, పాలిటెక్నిక్ కాలేజీల విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగులో భద్రతా నినాదాలు అనే అంశంలో గైస్‌కు చెందిన టి.స్వామినాథన్ ప్రథమ బహుమతి, ఆంగ్లంలో ఎన్.సాగర్ కుమార్ ద్వితీయ బహుమతి, వర్కుషాప్ మెషినరీ సేఫ్టీ చిత్రలేఖన పోటీలో జి.కుసుమ ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. వీరిని గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అభినందించారు.

నారీశక్తిని గౌరవించాలి



మహిళాశక్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు



సత్కారం పొందిన మహిళా చిరు వ్యాపారులతో నిర్వాహకులు

దాబాగార్డెన్స్: మహారాణిపేటలో గల మహిళా శక్తి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సాంప్రదాయ రీతిన నిర్వహించిన కార్యక్రమంలో నారీమణులు ఒకే వేదిక పైకి వచ్చి వారి అభిప్రాయాలు తెలిపారు. గట్రెడ్డి రమాదేవి నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

మహిళా చిరు వ్యాపారులకు సత్కారం..

మహారాణిపేట: తోపుడు బండ్ల సంక్షేమ సంఘం, రూపాకుల విశాలక్ష్మి చారిటబుల్ ట్రస్టు నిర్వహణలో ఆదివారం మహారాణిపేటలోని న్యూ మోడల్ హాకర్ జోన్‌లో మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా చిరు వ్యాపారులను సత్కరించారు. రాజీవ్ గాంధీ మానవ సేవ జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్, చిరు వ్యాపారులు దాకమర్రి బాలాజీ, జి.మనీశ్వరరావు, డి.సింహాచలం, చిన్న, గురునాథం, డి.సంధ్యారాణి, ఒ.భాగ్యలక్ష్మి, డి.కనకదుర్గమ్మ, జి.నాగమణి, కె.వరలక్ష్మి, జె.అరుణమ్మ, లక్ష్మి, బి. దేవుడమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



పూర్ణామార్కెట్‌లోని ఫ్రూట్‌మార్కెట్ దగ్గరి బడ్డీలు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

జగదాంబ: పూర్ణామార్కెట్‌లోని ఫ్రూట్‌మార్కెట్ సమీపంలోని బడ్డీలను జీవీఎంసీ సిబ్బంది ఆదివారం తొలగించారు. ఇటీవల పూర్ణామార్కెట్ మొదలుకొని బౌడారారోడ్డు, రామకృష్ణా రైతు బజార్ వరకు జీవీఎంసీ, పోలీసు అధికారులు ఆక్రమణలు తొలగిస్తున్న విషయం తెలిసిందే. అయితే తాజాగా ఇదే వార్డులో ఫ్రూట్‌మార్కెట్ సమీపంలోని లారీ అసోసియేషన్ వద్ద కూడా బడ్డీలు ఇష్టానుసారంగా పెట్టడంతో జీవీఎంసీ అధికారులు తొలగించారు. అలాగే వన్‌టౌన్ ఏవీఎన్ కళాశాల నుంచి పాత బస్టాండ్ వరకు ఆక్రమణలు పెరిగిపోయాయని, వాటిని కూడా అధికారులు తొలగించి రహదారిలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు కోరుతున్నారు.

రహదారి పైనే వ్యాపారంతో ఇబ్బందులు



రహదారిపై చేపల విక్రయం



రోడ్డుకు అడ్డంగా వేసిన చేపల క్రేట్లు

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులోని చేపల మార్కెట్ ఇబ్బందులకు గురి చేస్తోందని ప్రసాద్‌గార్డెన్స్ స్థానికులు, స్క్రాప్ వ్యాపారులు వాపోతున్నారు. ముఖ్యంగా ఆదివారం రోడ్డుపై కాలు పెట్టలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన చెందుతున్నారు. ఇక్కడి ఇందిరా మున్సిపల్ స్టేడియం ప్రహరీకి ఆనుకుని రహదారి పైనే చేపల విక్రయాలు జరుగుతున్నాయి. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున వ్యాపారులు వచ్చి ఆది, మంగళ, శుక్రవారాల్లో వ్యాపారాలు చేస్తుంటారు. దీంతో చేపల నీళ్లు, వ్యర్థాలు చుట్టుపక్కల పేరుకుపోయి దుర్వాసన అలుముకుంటుంది. స్థానికుల ఇళ్లు, ఇక్కడి స్క్రాప్ వ్యాపారుల దుకాణాల్లోకి ఇది చేరి దుర్గంధభరితంగా మారుతోంది. గతంలో పలు మార్లు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ తాత్కాలిక చర్యలు తీసుకోవడవంతో పరిస్థితి మొదటికి వచ్చిందని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

స్వామి వివేకానంద సంస్థలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, సీపీ బాగ్చి

దాబాగార్డెన్స్: పాత నగరంలో గల వివేకానంద స్వచ్ఛంద సంస్థ అన్నదాన కార్యక్రమం చేపట్టి 25 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం మహా రక్తదాన శిబిరం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. లయన్స్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా రక్తదాన శిబిరం, మహాన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి ప్రారంభించారు. సుమారు 45 మంది రక్తదాతలు ముందుకొచ్చి రక్తం అందించారు. ఎమ్మెల్యే వంశీ మాట్లాడుతూ సంస్థ మంచి కార్యక్రమాలు నిర్వహిస్తుందని, సంస్థ అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలిపారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ నగరంలో రక్తం కొరత తీవ్రంగా ఉందని, రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద సంస్థ నిర్వాహకులు, రక్తం అందించిన రక్తదాతలను అభినందించారు. ఆశ్రమంలో వృద్ధులను సొంత తల్లిదండ్రుల వలే సంరక్షిస్తూ, మంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, సంస్థకు పలు సలహాలు, సూచనలు చేశారు. పదో తరగతి విద్యార్థులకు ప్లాంకులు, పెన్నుల సెట్లు అందజేశారు. అన్నంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని 20 ఏళ్లుగా సంస్థకు అన్ని విధాలా సహకరిస్తున్న మట్టపల్లి హనుమంతరావు, పిల్లలకు ఉచితంగా విద్యనందిస్తున్న వాసు మాస్టారును ప్రముఖుల చేతుల మీదుగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, ద్రోణంరాజు శ్రీవత్సవ్, మహ్మద్ సాధిక్, సీనియర్ పాత్రికేయుడు వీవీ రమణమూర్తి, కందుల నాగరాజు, వేణుగోపాల్, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, చింతపల్లి పోతురాజు, సీరం శ్రీనివాస్, డి. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కరెడ్ల



నియామకపత్రం అందుకుంటున్న కరెడ్ల రమేష్

దాబాగార్డెన్స్: శ్రీ విశాఖ కళాసాగర్ ఫిల్మ్ యాక్టింగ్ కల్చరల్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ నూతన వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కరెడ్ల రమేష్‌ను నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. ఈ మేరకు ఆదివారం డాబాగార్డెన్స్‌లో గల వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఏయూ యాక్టింగ్ డిప్లమో కోచ్ డాక్టర్ శశిభూషణ్, సోషల్ మీడియా స్టేట్‌చైర్మన్ సన్‌మూర్తి, డాక్టర్ సురేష్‌బాబు నియామక పత్రం అందజేశారు. సంస్థ అధ్యక్షుడు కరెడ్ల అప్పలరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షురాలు నల్లబెల్లి విజయ, ఉపాధ్యక్షుడు భీశెట్టి వెంకటేశ్వరరావు, పేడాడ రమణ, ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ వరప్రసాద్, జాయింట్ సెక్రటరీ కొణతాల దామోదరరావు, బాపిరాజు, బీవీ నాయుడు, కె. నూకరాజు, శిరీష, రేవతి, హరిప్రసాద్, సురేష్, లతీష్‌కుమార్ పాల్గొన్నారు.

కరాటే కోచ్‌కు సన్మానం

మర్రిపాలెం: ఎంతో మందికి కరాటేలో కోచింగ్ ఇచ్చిన ఇంటర్‌నేషనల్ కోచ్ ఎల్లారావును జీవీఎంసీ 51వ వార్డు ఈస్ట్‌పార్కులో ఆదివారం ఉదయం ప్రభుత్వ పాఠశాల రిటైర్డ్ డ్రిల్ మాస్టర్ పొన్నాడ అప్పారావు, పార్కు అసోసియేషన్ సభ్యులు సత్కరించారు. ఆయన శిక్షణలో రాటుదేలిన ఎంతో మంది బంగారు పతకాలు సాధించారని, ఎల్లారావు శిక్షణ అటువంటిదని ఆయనను పలువురు కొనియాడారు.

ఉత్సాహంగా 'సిడ్నీ తెలుగు సీనియర్స్' సమావేశం

విశాఖ విద్య: సిడ్నీ తెలుగు సీనియర్స్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశాన్ని 52వ వార్డు మర్రిపాలెం వుడా లేఅవుట్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో మందలపు వాసుదేవరావు ఆధ్వర్యంలో రిటైర్డ్ ఎస్.పి.డి.వి.సాయిబాబా అధ్యక్షతన ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. ముఖ్య అతిథి ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు మాట్లాడుతూ సిడ్నీ తెలుగు సీనియర్స్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన పి.ఆర్.విజయ్‌కుమార్ ఎంతో శ్రమించి 250 మంది సభ్యులకు సంబంధించి రూపొందించిన అడ్రస్ డైరీని గణబాబు చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం సీనియర్ సిటిజన్లు తమ అనుభవాలను పంచుకున్నారు. సమావేశానికి కీలక పాత్ర పోషించిన వాసుదేవరావును అభినందించారు. కార్యక్రమంలో బి.మల్లికార్జునరావు, మస్తాన్ రావు, జె.సుధాకర్, జి.మురళీమోహన్, ఎ.శ్రీరాములు, ఆర్.అప్పారావు, రామకోటేశ్వరరావు, నేతి శ్రీనివాసరావు, రాధాకృష్ణ(చెన్నై), టి.బి.రాజేంద్రప్రసాద్, ఉపేంద్ర, పలువురు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

మురళీనగర్: వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైశాఖి స్పోర్ట్సు పార్కులో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కిమ్స్ ఆస్పత్రి సహకారంలో నిర్వహించిన ఈ శిబిరంలో కార్డియో వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ భరత్ అరుణ, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ సర్దార్ రామ్, హెమటో అంకాలజిస్టు డాక్టర్ కోట కిషోర్‌కుమార్, కార్డియాలజిస్టు డాక్టర్ కిషోర్ కాహినందుని పాల్గొని ఆరోగ్య సంరక్షణకు సంబంధించి పలు సలహాలు అందించారు. కార్డియో వాస్క్యులర్ సమస్యలపై డాక్టర్ భరత్ అరుణ్ వివరణాత్మకంగా వివరించారు. వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలు తెలిపారు. పలువురి సందేహాలను అక్కడికక్కడే నివృత్తి చేశారు. శిబిరంలో బీఎండీ, ఈసీజీ, బీపీ, సుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పొందూరి ప్రభావతి, కార్యదర్శి ఎం.విజయగౌరి, డిస్ట్రిక్ట్-101 ఆర్సీ-5 యు.శుభ, కోశాధికారి ఎం.భానుమతి, వైశాఖి స్పోర్ట్సు పార్కు అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్ శిబిరం నిర్వహణకు సహకరించారు.

కళావిహీనంగా వాటర్ ఫౌంటైన్



అక్కయ్యపాలెంలోని మహారాణీ పార్లర్ కూడలిలో కళావిహీనంగా మారిన వాటర్ ఫౌంటైన్



ఫౌంటైన్ లోపల నాచుపట్టిన నీరు

సీతంపేట: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన బ్యూటిఫికేషన్‌పై ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో నిర్వహణ కొరవడింది. అభివృద్ధి పనుల్లో భాగంగా అక్కయ్యపాలెంలోని మహారాణి పార్లర్ వద్ద వాటర్ ఫౌంటైన్ ఏర్పాటు చేశారు. ఫౌంటైన్ చుట్టూ హంసలు, వాటి నోటి లోంచి నీటి ధారలు విద్యుత్ వెలుగుల్లో చూడముచ్చటగా కనిపించేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఫౌంటైన్ నిర్వహణ లోపించింది. నీటి ధారలు ఆగిపోయాయి ఫౌంటైన్ లోపల నీరు పూర్తిగా నాచుపట్టి అధ్వానంగా మారింది. ఫౌంటైన్ నేడు కళావిహీనంగా మారడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఫౌంటైన్‌ను పునరుద్ధించాలని కోరుతున్నారు.

ముగిసిన నీలమ్మ వేపచెట్టు అమ్మవారి వార్షికోత్సవాలు



నీలమ్మ వేపచెట్టు అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు

అల్లిపురం: అస్సాం గార్డెన్స్‌లోని నీలమ్మ వేపచెట్టు అమ్మవారి వార్షికోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. ఈ నెల 6వ తేదీన అమ్మవారి వార్షికోత్సవం అత్యంత వైభవంగా చేపట్టారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం అమ్మవారి సన్నిధిలో అన్నసమారాధన చేపట్టారు. ఉదయం నుంచి ఆలయ అర్చకుడు జోగారావు శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ ఈవో జీవీ రమాబాయి తరఫున ఆలయ సిబ్బంది, 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి, టీడీపీ, జనసేన నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. ఆలయ అర్చకుడు జోగారావుశర్మ అమ్మవారి శేషవస్త్రంతో ఆయనను సత్కరించారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదం స్వీకరించారు.

అద్భుతంగా యామిని కూచిపూడి రంగప్రవేశం



కూచిపూడి నృత్యంతో అలరిస్తున్న యామిని

మద్దిలపాలెం: నృత్యకారిణి యామిని కూచిపూడి నృత్యంలో రంగప్రవేశం చేశారు. సిద్ధేంద్ర యోగి కళా నిలయం గురు ఎన్.ఎస్.వి.సత్యభాను వద్ద 15 ఏళ్లుగా రాష్ట్ర సంప్రదాయ నాట్యం కూచిపూడిని అభ్యసిస్తూ, సర్టిఫికెట్ కోర్స్ డిప్లమో కోర్స్ ఇన్ పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో పాసై అనేక ప్రతిష్టాత్మకమైన ప్రదర్శనలు ఇచ్చిన ఆమె ఆదివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో కూచిపూడి నృత్యంతో అలరించారు. ముఖ్య అతిథి చార్టెడ్ అకౌంటెంట్ చంద్రశేఖర్, కళాభారతి కార్యదర్శి డాక్టర్ జి.ఆర్.కె.ప్రసాద్ రాంబాబు, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింతా రవి బాలకృష్ణ, కూచిపూడి కళాక్షేత్ర ప్రిన్సిపాల్ గురు హరి రామ్మూర్తిల సమక్షంలో అద్భుతమైన కూచిపూడి నాట్యముద్రికల నడుమ ఆమె కూచిపూడి రంగ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా యామిని చేసిన నాట్యం అతిథులను మంత్రముగ్ధులను చేసింది. అనంతరం ఆమెను ఆశీర్వదించి నాట్య సౌదామిని అవార్డుతో సత్కరించారు. యామిని సిద్ధేంద్ర యోగి కళా నిలయం ఫౌండర్ డైరెక్టర్ ఎన్.ఎస్.వి.సత్యభాను గురుపూజోత్సవం చేశారు. ఈ రంగ ప్రవేశ కార్యక్రమానికి గాత్రం డి.ఎస్.వి.శాస్త్రి, మృదంగం రాజాగోపాల ఆచార్య, వయెలిన్ ఎమ్మెస్ నీలాద్రి, వీణ శశిధర్, ఫ్లూట్ వి.బి.ఎస్.మురళి, మేకప్ ధరణి, దుస్తులు కూర్మారావులు సహకరించారు.